'రాజు-పేద'

గత మాసం 25 వ తేదీన విడుదలయిన "రాజు పేద" చిత్రం ఈ నెల 4 వ తేదీన మద్రాసులోని పత్రికలవారికీ, సినిమా ప్రముఖులకీ చూపబడింది. పారగాన్ థియేటరు ఆరోజున అతిథులతో కిటకిటలాడింది.

"ప్రిన్స్ ఎండ్ ది పాపర్" నవల ఆధారంగా తీయబడిన ఈ చిత్రానికి నిర్మాత, దర్శకుడు బి. ఏ. సుబ్బారావుగారు. మాటలు పినిశెట్టి; పాటలు అనిశెట్టి, శ్రీ శ్రీ, ఆత్రేయగారు. సంగీత దర్శకుడు రాజేశ్వరరావు; ఫొటోగ్రఫీ ఆది ఇరానీ. సూరాకీ, ఎస్. వి. రంగారావు, ఎన్. టి. రామారావు, లక్ష్మీరాజ్యం, అమర్నాథ్, రేలంగి, ఆర్. నాగేశ్వరరావు మున్నగువారు తారాగణం.

"సినిమా అవసరాల కోసం మూలకథలో చాలా మార్పులు చేసినందువల్ల కొందరు, కథా రచయిత మార్క్ ట్వైన్ అని



"రాజు పేద" లో పక్షంగా ఆర్. నాగేశ్వరరావు.

★

"శేమక్కై" లో పావురంతో సరసాలాడుతున్న అంజలీదేవి.



★ “రాజు పేద” ★

‘టైటిల్స్’లో చూపలేదు. మంచిదే. కొంతకాలం క్రిందట ఇదే కథను ఒక హాలీవుడ్ కంపెనీవారు సినిమా తీశారు. ఇంగ్లీషులో మూలకథను, పాత్రలను కొంత మార్చి తీశారు. అదేవిధంగా తెలుగులో కూడా మార్పులు చేశారు. నవలలను సినిమాలుగా తీసున్నప్పుడు మార్పులు చేయడమే అందరూ చేస్తున్న పనే. ఇందులో పెద్ద తప్పు పట్టవలసిన అవసరం లేదు. చేసిన మార్పులు మూలకథలో రచయిత ఉద్దేశించినదానికి దోహదకారులుగా ఉన్నాయా, భంగకారులుగా ఉన్నాయా అనేదే ఆలోచించవలసిన ప్రశ్న.

“ప్రిన్స్ ఎండ్ ది పాపర్”లో ఒక ముఖ్యమైన పాత్ర మైల్స్ హెండన్. ఇతను కూడా యువరాజు సింహాసనానికి తాత్కాలికంగా దూరమైనట్టే, తన జమీందారీ నుండి తాత్కాలికంగా వెళ్ళగొట్టబడి బాధలు పడతాడు. మైల్స్ హెండన్, యువరాజు పాత్రలు ఒకదాని కొకటి అద్దాలవలె పనిచేస్తాయి. అంతేకాక మైల్స్ యువరాజును అంగరక్షకునివలె చివరవరకూ కాపాడుకుంటూ వస్తాడు. అందుచేత అతని పాత్రకు కథలో ఒక స్పష్టమైన ప్రయోజనం ఉన్నది. తెలుగు చిత్రంలో ఈ పాత్రను ‘కామెడియన్’ పాత్రగా మార్చారు. మార్చినా ఫరవాలేదు. కాని కథలో అతను నిర్వర్తించే ప్రయోజనం దాదాపు మృగ్యం. ఈ మార్పు అంత సమర్థించదగినదిగా కనబడదు.

ఇతర పాత్రల విషయంలో కూడా అట్టే పాత్రౌచిత్యం పాటించబడలేదు. యువరాజు ప్రాగ్భారం మాస్తారును, దాసీలను గుండ్రంగా తిరగండని ఆజ్ఞాపించి తను వినోదించడం, మహారాజు తన బావమరిది విక్రమ్‌ను నాటిమాటికి పాటల్లో పాడవడం, ‘నేనుమందును’ అందరిచేత త్రాగించడం వెకిలిగా ఉండి ఆ పాత్రల ఉదాత్తతను భంగపరుస్తున్నాయి. విక్రమ్ కుట్రదారు అనే అనుమానం తన కున్నట్లు మహారాజు చాలచోట్ల వ్యక్తపరుస్తాడు. ఆ అనుమానానికి కారణం ఎక్కడా స్థిరపరచబడలేదు. పోనీ అనుమానం ఉన్నప్పుడు విక్రమ్‌ను యువరాజుకు దూరంగా ఉంచడానికీ, మరే చర్యా తీసుకోడానికీ ఆయన ప్రయత్నించలేదు.

ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ ఈ చిత్రం ప్రేక్షకులను ఆకర్షించడానికి కావలసిన కొన్ని హంగులు సంతరించుకోవడం చేత విజయవంతం కాగలదని ఆశించవచ్చు.

నటీనటులందరూ బాగా నటించారు. పురుష పాత్రధారులు కొంతరకం ముక్కుల్లో పాపం, ఇబ్బందిపడినట్లు కనిపించినప్పటికీ సమర్థతతో తమ పాత్రలు నిర్వహించారు. మహారాజుగా రంగారావూ, యువరాజుగా, పేదగా సుధాకర్ ముఖ్యంగా ప్రశంసనీయులు. ఎన్. టి. రామారావు, లక్ష్మీరాజ్యం, రేలంగి తృప్తికరంగా నటించారు. అమ్మాజీ కొత్తనటి అయినా చక్కగా నటించింది.

రాజేశ్వరరావుగారు ట్యూన్ చేసిన పాటలు విడిగా వింటే బాగుంటాయనడానికి సందేహం లేదు. ఆయా సందర్భాలకు అతికించినట్లుండడం చేతను, సంఘటనా బహుళమైన ఇలాంటి కథలో పాటలకు స్థానం లేకపోవడం చేత చిత్రంలో అంతగా రక్తి కట్టలేదు. రాజ దర్బారు, యువరాజు గది, కోట మొదలైన సెట్టింగులు బాగున్నాయి.

పినిశెట్టి శ్రీరామమూర్తిగారు వ్రాసిన మాటలతో వెలువడిన మొదటి చిత్రం ఇది గనుక వారి రచన మొదటి ప్రయత్నంగా తృప్తికరంగా ఉందనే చెప్పాలి. వారి భాష ముందుముందు ఇంకా మంచి పరిణతి పొందగలదని ఆశించవచ్చును.

హిందీలో ఒకప్పుడు స్టంటు చిత్రాలు విరివిగా వెలువడేవి. తెలుగులో అవి లేకపోవడం ఒక కొరతే అయితే ఆ కొరతను తీర్చినందుకు బి. ఏ. సుబ్బారావుగార్ని అభినందించవలసి ఉంది.

“రాజు పేద”పై ప్రేక్షకుల అభిప్రాయాలు

మొన్న “రాజు-పేద” చూశాను. నేను లోగడ ‘ఆంధ్రపత్రిక’ సచిత్రవారపత్రికలోను దరిమిలా పుస్తక రూపంలోను ప్రకటించిన ‘మార్క్ ట్వేన్’ గారి “రాజు-పేద” తెలుగు అనువాదం చదివాను. కథ “ఆంధ్రవారపత్రిక” లో దాని ‘పబ్లిసిటీ’ కూడ చేశారు. కాని ఆ కథకు, ఈ సినిమా కథకు దాదాపు పోలికే లేదని నా మనస్సుకు తట్టింది. కనీసం ‘టైటిల్సు’ చూపునప్పుడైనా ‘మార్క్ ట్వేన్’ గారి పేరు చూపకుండుట బాగులేదు.

‘రాజు—పేద’ సినిమా చూసిన తర్వాత ఇది చారిత్రికమా? లేక జానపదమా? అనే సందేహం నాకు కల్గినది. దీనిలో చారిత్రిక ముఖ్యమైన విషయములకంటె జానపదములకు ఎక్కువ అనుకూలముగా కథను మార్చినారు. పాత్రపోషణములో అన్యాయము జరిగింది.

మొట్టమొదటిది [illegible] పాత్ర. ‘మార్క్ ట్వేన్’ గారి ‘టామ్’ తెలివిగలవాడు. వచ్చిన ప్రతిచిన్న అవకాశాన్ని జారవిడవకుండా జాగ్రత్తగా మెలిగాడు. మొదట్లో తాను యువరాజును కానని వాదించినా, తర్వాత అంతరంగములో బాధపడుతూనే తాను యువరాజుగా నటించటానికి ప్రయత్నించాడు. మహారాజు చనిపోయిన అనంతరము రాచకార్యములను అతి సమర్థతతో నిర్వర్తించాడు. కాని వారిగాడ్లో, మొదటినుంచి చివరవరకు “నేను యువరాజును కాను. నన్ను వదిలివేయండి బాబూ! అమ్మా!” అని ప్రతిమిలాడుతాడు. సమగ్రత కలవానిని ఎక్కడా బుజువుకాడు. (పన్నుల తగ్గింపుదగ్గర మినహా).

‘మార్క్ ట్వేన్’ మహారాజు అతి సమర్థుడు. తను చేయదల్చుకొన్న పనిని నిర్దాక్షిణ్యముగా చేసి తీరుతాడు. కాని ఈ సినిమాలోనో? ఎప్పుడూ “నేనెప్పూనిన కత్తులు, పాలుపోసి పెంచిన పాములు” అనుటయే కాని కార్య కారదక్షతయు కలవాడు కాడు.

తర్వాత అతి ముఖ్యమైన ‘మైల్స్ హెండన్’ పాత్ర. దీనిని దాదాపు ఖూనీ చేశారని చెప్పవచ్చు. ‘మైల్స్ హెండన్’ అతి గంభీరుడు. శూరుడు. ముక్కుకు సూటిగా పోయే రకం. ఎప్పుడూ సైనికముగా ఆలోచించుట తప్ప ధీరత్వ మెరుగడు. తనకు దొరకిన కుఱ్ఱవాడు యువరాజని తెలియకపోయినా, వాని మాటలు చేష్టలకు ముచ్చటపడి ప్రాణస్నేహితునిగా భావించాడు. చివరకు నానావమానముల పాలైనా, ప్రాణాపద వచ్చినా యువరాజును వదలకుండా అంగరక్షకునివలె

కాపాడాడు. ఇక సుధీర్‌లో? వట్టి మాటల పోగు. జేబులో "బొమ్మ" ఉంటేనే కాని ఎదుటివానితో కలబడలేడు. తాను దుష్ట శిక్షణకూ, శిష్టరక్షణకూ బ్రతుకుతున్న వీరుడనని చెప్పుకునే రకం. కాని కత్తికూడ సరిగా ఒరలో పెట్టుకోలేడు. వారిగాడు తన ప్రియురాలి తమ్ముడనుకుంటేనే ఆశ్రయ మిచ్చాడుగాని, యితరులకైతే చోటు పెట్టే వాడుకాడు. అచ్చి, మల్లిలతో వారిగాణ్ణి బతికి తీసుకువస్తానని చెపుతాడుగాని అటు వంటి ప్రయత్నం చేయడు. ఎంతసేపూ 'స్టంటు' చిత్రాలలో మాదిరి ఒకళ్ళ తర్వాత ఒకళ్ళతో యుద్ధంచేస్తాడు. (తక్కిన వాళ్ళు చూస్తూ ఎందుకూరుకుంటారో మరి?).

మార్క్ ట్వేన్ నవలలోని యువరాజు మేనమామ హెండర్సన్ ప్రభువు రాజభక్తుడు. స్వంత మేనమామయినా యువరాజును గౌరవముగా చూస్తాడు. రాజ్యకాంక్ష లేనివాడు. యువరాజు పిచ్చివాడైనాడని బాధపడతాడు. తన కనుమానము వచ్చినా దిగమ్రింగి ఊరకుంటాడు. పట్టాభిషేక సమయములో నిజమైన యువరాజును కనుగొనుటకు తగిన ప్రయత్నము చేస్తాడు. కాని విక్రంసింగ్ ప్రతిసారి యువరాజుకు తాను మేనమామనని గుర్తు చేయుటకు ప్రయత్నిస్తాడు. రాజ్యపరిపాలనాకాంక్ష కలవాడు. రాచనగరులోనున్నది తన మేనల్లుడు కాదని తెలిసినా తను రాజ్యమేలవచ్చునుగదాయని కపటనాటక మాడుతాడు. దయా దాక్షిణ్యములు లేక తన మేనల్లుని చంపించ ప్రయత్నిస్తాడు. పట్టాభిషేకసమయమున మేనల్లుని గుర్తించికూడ అతనిని త్రోసిరాజన చూస్తాడు. చివరకు యువరాజును హత్య చెయ్యబోయి తానే మరణిస్తాడు.

ఇక దుస్తులు. కథ భారతీయ వాతావరణములో నడచినా దుస్తులుమాత్రం (మగవారికి) పాశ్చాత్యపద్ధతిలో నడచినవి. కథలోని సేవకప్రభువులకు మారు దాసీ స్త్రీలను ప్రవేశపెట్టారు. సుబ్బారావుగారు ఏ పుస్తకములోనైనా చదివారో, లేక ఊహించారో మరి హిందూదేశపురాజులు నాగ్రా బొమ్మ దుస్తులు ధరిస్తారని. ఇటీవలి తెలుగు సినిమాలలో సంభాషణ లొక క్రొత్తపంథా త్రొక్కుచున్నవి. అది చారిత్రిక, పౌరాణిక, జానపద, సాంఘిక చిత్ర మేదైనా కానీయండి, దేవునిమీద, ధనికవాదముపైని వ్యంగ్యమైన మాటలు, పాటలు వినవస్తున్నాయి. ప్రపంచానికి దేవుడూ, ధనికుడేనా హాని కలిగిస్తున్నది? ఇదా! అభ్యుదయకరమైనపంథా? ఇంతమాత్రం చేతనే ఆస్తికత్వము, ధనికవాదము, ప్రపంచములో రూపుమాసిపోవునా?

మహారాజుగా రంగారావు, పోలిగాడుగా రామారావు, వారిగాడు, యువరాజులుగా సుధాకర్ సమర్థతతో నటించారు. రేలంగి చాకలివాని హాస్యముతో తనపూర్వ ప్రతిష్ఠను తానే తగ్గించుకున్నాడు. క్రొత్త నటి అమ్మాజీ ఫర్వాలేదు. మిగిలినవారి నటన అంత తృప్తికరముగా లేదు. టెక్నికల్‌గా పిక్చరు ఏవరేజిగా ఉన్నది. రాజేశ్వరరావుగారి మ్యూజిక్ ఏమంత తృప్తికరముగా లేదు. చివరి మాట. ఇది "తెలుగు సినిమా ప్రపంచపు పోకడ"ని తృప్తిపడుట తప్ప వేరొకమార్గము, గత్యంతరము సినిమా చూసిన ప్రేక్షకునికి లేదు.

—వై. వి. సుబ్బారావు,
ఈడ్పుగల్లు.

* * *

ప్రఖ్యాత నవలా రచయిత మార్క్ ట్వేను "ప్రిన్స్ ఎండ్ ది పాపర్" ను అనుసరించి తీయబడిం దీచిత్రం. మొన్నీమధ్యే ఆంధ్రదేశంలో విడుదలై ప్రజాదరణతో నడుస్తోంది.

పేదకూడా రాజరికాన్ని నేర్పుతో నిర్వహిస్తాడని వారిగాడి పన్నుల నిర్ణయ ఘట్టం నిరూపిస్తుంది. అలాగే రాజు కూడా ఒకమాటు పేదరికాన్ని చవిచూస్తే, వారి బాధల నర్థంచేసుకొని, సంపూర్ణ సానుభూతితో పేదలను పరిపాలిస్తాడని చివర మనం నేర్చుకొనే నీతి.

రాజు జీవితానికి, అతని ప్రజల జీవితానికి ఎంత తేడా వుంటుందో బాగా చిత్రీకరించబడింది. కోటగోడలు పాలక పాలితులను పూర్తిగా వేరుచేసి ఒకరిసంగతు లొకరికి తెలియకుండా చేయడం మూలంగానే కథ అనేది జరగటాని కవకాశం వుంది. కోటలో వారిగాడు "నేను యువరాజును కాను" అంటే యువరాజుకు మతిభ్రమించిందని రాజవైద్యులు చికిత్స చేయబోతారు. పాలెంలో నరేంద్రుడు నేను యువరాజునంటే "ఈమధ్య వారిగాడికి మతిపోయింద"ని వేళాకోళం చేస్తారు.

ఈ చిత్రం విజయం పొందితే (పొందుతుందని ఆశించడంలో అతిశయం వుండదు) దానికి మూడుకారణాలు చెప్పుకోవచ్చు. మొదటిది కథలోని పటుత్వం. రెండవది రాజేశ్వరరావు సంగీతం. మూడవది సుధాకర్ నటన.

కథలోని పటుత్వం, ఔన్నత్యం అందరకూ తెలిసినదే. రాజేశ్వరరావు సంగీతం బాగుంది. ముఖ్యంగా పాటలు భావయుక్తంగాను రసవంతంగాను ఉన్నాయి. దీనికి తాపీ, ఆత్రేయ ప్రభృతుల నభినందించాలి. సంభాషణలుగూడ యుక్తివంతంగాను, కథాగమనానికి దోహదం చేసేవిగాను ఉన్నాయి. "వారిగా, వాయనా" అనే పాట ఎబ్బెట్టుగా వుండటం, అచ్చి, మల్లిల పాటలు పేద వాతావరణానికి సరిపోక పోవడం, పెద్ద లోపాలు కావు, మిగతా చిత్రాలతో పోలిస్తే.

ఇక మూడవది సుధాకర్ నటన. అతని నటన చూస్తూ మనం మిగతా విషయాలన్నీ మర్చిపోతాం. ముఖ్యంగా దుస్తులు మార్చుకొనే దృశ్యంలో పేద బాలుని జడుపు, రాజపుత్రుని ఠీవి, ప్రదర్శించడం అతను గత పాత్రల్ని ఎంత శ్రద్ధగా ఆకళింపు చేసుకున్నాడో విశదీకరిస్తుంది.

మిగతావాళ్ళ నటనకూడా ఫరవాలేదు. ఎన్. టి. రామారావు "దాసి" చిత్రాన్ని మరోమాటు మనకు జ్ఞాపకంచేశారు. అలాగే లక్ష్మీరాజ్యం కూడాను. కేవలం పేరు ఉపయోగించుకోవడం కోసమే ఎస్. వి. రంగారావుని తీసుకున్నా రనిపిస్తుంది. ఈ చిత్రంలో మహారాజు పాత్రలో, అతను ప్రదర్శించగల నైపుణ్యానికి స్థానం లేదు. ఆ పాత్ర మరెవరికిచ్చినా పరవాలేక పోవును. అయినా ఉన్నంతలో బాగానే నటించారు.

స్టంటుసీనులు కొంచెం తగ్గించివేస్తే చిత్రం పొడుగుతగ్గి ఇంకా బాగుండేదేమో. ముఖ్యంగా కథాగమనానికి స్టంటులు అడ్డు తగిలాయి. చివరిభాగంలో కథ క్లైమాక్సుకి వచ్చినప్పుడు టెంపో క్షీణించింది. కోటలో వారిగాడి పట్టాభిషేక దృశ్యమూ, బయట పోలిగాడు, సుధీర్, నరేంద్రుల గుఱ్ఱపు స్వారీ దృశ్యమూ, మార్చి మార్చి రెండు మూడు సారులు చూపిస్తేరు. అలాగే తరవాత రాజముద్ర వెదకి తెమ్మని సుందరొకర్ని పంపి, వాడిచేత లేదనిపించి, ఈలోగా వారిగాడు పాతసంగతులు జ్ఞాపకంచేసిన తర్వాత మళ్ళీ పంపించడం, కేవలం చిత్రాన్ని పొడుగుచేయడానికే ననిపిస్తుంది.

అలాగే మరో విషయమూ. రెండు నిముషాలు ఉండనగా విలనువిక్రమ్, వారిగానిపై కత్తి విసురుతాడు. వెంటనే విక్రమ్, పోలిగాడు మధ్య ద్వంద్వయుద్ధం, కోటవద్దగ సుధీర్, కొపలావాళ్ళమధ్య కత్తియుద్ధం దృశ్యాలూ కలగాపులగం చేసి చూపించబడ్డాయి. ఇంతకీ చివరకు వారిగాడు కత్తిదెబ్బకు తట్టుకొని బతికాడా లేదా? అనే సందేహాన్ని నివారించుకోవాలంటే ఆట ఆఖరిపాట్లు పరిశీలనగా చూచి గుర్తుపట్టాలి. జాతీయపతాక ఎగిరేదాకా శాంతంగా కూర్చోలేక ఇంటికి పోదామనే ఆతురతతో చివరి నిముషంలో సీట్లలోంచి

"రాజూపేద"పై ప్రేక్షకుల అభిప్రాయాలు

లేచిపోయే ప్రేక్షకులను, ఈ రకంగా సమాప్తం చెయ్యడం నచ్చకపోతే అది వారి తప్పుగాదు. అంత ప్రధాన దృశ్యాల్ని అంత చివరిదాకా ఉంచకూడదు.

ఇక ప్రేక్షకుల్ని రంజింపచేయడానికి హాస్యం కావాలి. దానికోసం, సుధీర్ పాత్రను నియమించి దాన్ని రేలంగివారికిచ్చారు. దాన్ని ఆయన మామూలు ఫక్కీలోనే నిర్వహించారు. కాని సుధీర్‌కి, మల్లికి మధ్య ప్రణయాన్ని కల్పించడం అనవసరమేమో! మిగతా సినిమాలకు తీసిపోకూడదనో, ఆ మాత్రం ప్రేమ లేకపోతే బాగుండదనో ఇరికించినట్టుగా కనిపిస్తుంది. అలాగే ఎప్పుడూ గుఱ్ఱపు జూదం ఎరగని పేదవాళ్ళు పోలిగాడిచేత హఠాత్తుగా గుఱ్ఱపుస్వారీ చేయించడం, సహజత్వమును మరుగుపరుస్తుంది. వాతావరణం మనదైనా ఫర్ కోట్లలో పాశ్చాత్యతత్వం పోలేదు.

సత్యం—కాకినాడ


* * *

"రాజా - పేద" లో అత్యంత ప్రశంసనీయంగా మహారాజా సురేంద్రదేవు పాత్రను శ్రీ ఎస్. వి. రంగారావు పోషించారు. అతని నటన చూస్తున్నంతసేపు ప్రేక్షకులు 'హాయ్ హాయ్' అన్నారు. వీరి నటన ముందు రాబోయే అక్బరు పాత్రకు ఆకాత్కృతిగా ఉంది. మాష్టరు సుధాకర్ ద్విపాత్రాభినయం కూడ మెచ్చుకోదగ్గదిగా ఉంది. 'నటనలో కొత్తదనం కనిపించటంలేదు' అని అనుకుంటున్న ప్రేక్షకులకు శ్రీ ఎన్. టి. రామారావుగారి పాత్ర చాలా ఆనందాన్ని కలిగించింది. రౌడీగా, దొంగగా, ప్రేక్షకులను రంజింపచేశారు. స్త్రీలలో అమ్మాజీ, లక్ష్మీరాజ్యంగార్ల పాత్రపోషణ చక్కగా ఉంది.

కథతో సంబంధంలేని శ్రీ రేలంగి పాత్ర విమర్శనీయమైనను, సరిక్రొత్త హాస్యంతో ప్రేక్షకులను ఆనందపరిచింది. ఆర్. నాగేశ్వరరావు పాత్ర అంతగా పోషించలేదు. తదితర నటులు బాగానే నటించారు.

మగవాళ్ళ దుస్తులు 'అరేబియన్ నైట్సు' లోని వారిని జ్ఞప్తికి తెస్తూ, స్త్రీల వేషాలు మన సంప్రదాయాన్ననుసరించి ఉన్నాయి. ఇది పెద్దలోపం. కొన్ని సందర్భాలు పాశ్చాత్య విధానాన్ననుసరించి ఉండటం విచారకరం. మాటలు చిత్రానికి జీవం పోశాయి. పాటలు ఒకటి రెండు కంటె బాగాలేవు. శ్రీ రాజేశ్వరరావుగారి వద్ద నుండి ఆశించిన సంగీతం రాకపోగా వినుటకు అసహ్యం కలిగించింది.

మొత్తంమీద చిత్రం సంపూర్ణత నొందకపోయినా బి. ఏ. సుబ్బారావ్ ప్రొడక్షన్స్



యూనియన్ పిక్చర్స్ వారి "శ్రీ జగన్నాథ మాహాత్మ్యం" (తెలుగు) చిత్రంలో బృందగీతం ఒకటి ఇటీవల రికార్డు చేసినప్పటి దృశ్యం.